


# కరపత్రం

SINCE 2014

సోమవారం సెప్టెంబర్ 1 2025 | సంపుటి :0 | సంచిక :316 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

# యూపీఎస్సీ అభ్యర్థుల కోసం 'ప్రతిభా సేతు'..




- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యూపీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించలేకపోయిన అభ్యర్థుల కోసం 'ప్రతిభా సేతు' అనే ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించారు.
- ఈ పోర్టల్ ద్వారా ప్రైవేట్ కంపెనీలు తమకు అనువైన అభ్యర్థులను గుర్తించి వారికి ఉద్యోగాలు ఇవ్వవచ్చని తెలిపారు.
- దేశంలో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటంపై ప్రధానమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.
- ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
- జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం , ఇతర భద్రతా దళాల సేవలను ప్రశంసించారు.

యూపీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా 'ప్రతిభా సేతు' పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. దీని ద్వారా యూపీఎస్సీ అభ్యర్థులకు అనేక ప్రయోజనాలు ఉన్నట్లు మన్‌కీ బాత్125వ కార్యక్రమంలో మోదీ తెలిపారు. దేశంలోని కఠినమైన పరీక్షల్లో సివిల్ సర్వీసెస్ ఒకటని.. ప్రతి ఏడాది ఎంతో మంది అభ్యర్థులు రాస్తుంటారన్నారు. ఎంతో సమయం, డబ్బును ఖర్చు చేసి నిజాయతీగా కష్టపడుతున్న అభ్యర్థులు ఒక్కోసారి స్వల్ప తేడాతో సివిల్స్ తుది జాబితాలో చోటు దక్కించుకోలేకపోతున్నారని.. ఇలాంటి వారి కోసం 'ప్రతిభా సేతు' పోర్టల్‌ను ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

**జెట్ ఇంజిన్లను తయారుచేస్తాం**

సివిల్స్ పరీక్షల అన్ని దశలలో ఉత్తీర్ణత సాధించి.. మెరిట్ లిస్టులో పేరు లేని అభ్యర్థుల వివరాలను ఇకపై ఈ పోర్టల్‌లో ఉంచనున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఈ వివరాలను ప్రైవేట్ కంపెనీలు తీసుకొని.. తమ సంస్థలలో వారికి ఉపాధి కల్పించవచ్చని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని పరీక్షిస్తున్నాయి..**

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం, వరదలపై మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని పరీక్షిస్తున్నాయన్నారు. అనేక రాష్ట్రాల్లో భారీ వరదల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారని.. వేల సంఖ్యలో నిరాశ్రయులయ్యారన్నారు. తీవ్రంగా శ్రమిస్తున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు , భద్రతా దళాలు, సామాజిక కార్యకర్తలు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

**జమ్మూకశ్మీర్ మరింత ముందుకు వెళ్తోంది..**


వినాశకరమైన ప్రకృతి వైపరీత్యాలు జమ్మూకశ్మీర్‌ను అతలాకుతలం చేస్తున్నప్పటికీ.. అనేక విషయాల్లో ముందుకు వెళ్తుందన్నారు. ఇటీవల శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో నిర్వహించిన ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ గురించి మోదీ ప్రస్తావించారు. దేశ్యాప్తంగా 800 మందికి పైగా అథ్లెట్లు ఇందులో పాల్గొన్నారన్నారు. పురుషులతో సమానంగా మహిళా అథ్లెట్లు కూడా ఇందులో ప్రతిభ చూపారన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా కశ్మీర్‌లోని పుల్వామాలో తొలి సారిగా డే-నైట్ క్రికెట్ మ్యాచ్ జరిగిందని పేర్కొన్నారు. దేశం మార్పువైపు పయనిస్తోందనడానికి ఇవి ఉదాహరణగా నిలిచాయన్నారు.

## బీసీ బిల్లులకు భారత రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు: కేటీఆర్



2 లో

## కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికను ఎమ్మెల్యేలకు పెన్‌డ్రైవ్‌లో అందించిన ప్రభుత్వం



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకుపై జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం ఎమ్మెల్యేలకు పెన్‌డ్రైవ్‌లో అందజేసింది. ప్రధానంగా 3 ఆనకట్టల ప్రణాళిక, నిర్మాణంలో లోపాలు, తప్పిదాలు ఉన్నాయని నివేదిక తేల్చింది. అంచనాల తయారీ, పరిపాలన అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పేర్కొంది. ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతుల్లోనూ లోపాలు ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది.

పేజి 2లో ▶

## కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద మానవ తప్పిదం : ఉత్తమ్ కుమార్ రెడ్డి



కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద మ్యాన్ మేడ్ డిజాస్టర్ అని ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కాశేశ్వరం కమిషన్ రిపోర్టుపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్..లక్ష కోట్లు ఖర్చు పెట్టినా కొత్త ఆయకట్టు లక్ష ఎకరాలు కూడా పెరగలేదన్నారు. లక్ష కోట్లు ఖర్చు చేసినా ఐదేళ్లలో వాడుకున్న నీళ్లు 101 టీఎంసీలేనని చెప్పారు ఉత్తమ్. స్వతంత్ర భారతదేశంలో ఫైనాన్షియల్ డిజాస్టర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ అని అన్నారు ఉత్తమ్. మేడిగడ్డ కుంగినపుడు కేసీఆరే సీఎంగా ఉన్నారని చెప్పారు.

అసెంబ్లీలో పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టుపై మాట్లాడిన ఉత్తమ్.. తెలంగాణ ఏర్పడ్డాక అతిపెద్ద ప్రాజెక్టుగా కాళేశ్వరం చేపట్టారు. రూ. 87,449 కోట్లతో ప్రాజెక్ట్ చేపట్టారు. కాళేశ్వరానికి గుండెకాయ లాంటి మేడిగడ్డ కూలింది. రూ. 24వేల కోట్లతో చేపట్టిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది. 20 నెలలుగా అన్నారం, సుందిళ్ల,మేడిగడ్డ నిరూపయోగంగా ఉన్నాయి.

పేజి 2లో ▶

## నిజాంకంటే శ్రీమంతుడవ్వాలని కేసీఆర్ కోరిక...

# అందుకే మామా అల్లుళ్లు లక్షకోట్లు కొల్లగొట్టేందుకు స్కెచ్ వేసింద్రు : సీఎం రేవంత్



కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు సీఎం రేవంత్. కేసీఆర్ కు నిజాం కంటే శ్రీమంతుడు కావాలనే కోరిక ఉందని..అందుకే మామా అల్లుళ్లు కాళేశ్వరం రూపంలో లక్ష కోట్లు కొల్లగొట్టేందుకు ప్లాన్ వేశారని మండిపడ్డారు. నిపుణులు వద్దన్నా ప్రాణహిత చేవెళ్ల లొకేషన్ మార్చి.. మేడిగడ్డ దగ్గర ప్రాజెక్ట్ కట్టారని.. వీళ్లు చేసిన తప్పుకు ఉరి తీయాలని ధ్వజమెత్తారు రేవంత్. కమిషన్ రిపోర్ట్ అర్థమైనా అర్థం కానట్టు నటిస్తున్నారని ఫైర్ అయ్యారు రేవంత్.

నీళ్లు లేని చోట ప్రాజెక్ట్ కడితే ఖర్చు వృథా అవుతుందని కేంద్రం చెప్పిందన్నారు రేవంత్. పొగత్రాగడం హానికరం అని రాసినట్టే..ప్రాజెక్టు గురించి కేంద్రం హెచ్చరించిందన్నారు. కేసీఆర్ కు ధనాశ,దురాశ కల్గిందేమో అందుకే మేడిగడ్డ దగ్గరే ప్రాజెక్ట్ కట్టాలని అప్పటికే కేసీఆర్,హరీశ్ నిర్ణయం తీసుకున్నారని రేవంత్ చెప్పారు.

పేజి 2లో ▶

## అబద్ధపు వ్యాఖ్యలతో హరీశ్‌రావు సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు: సీఎం రేవంత్‌రెడ్డి

అబద్ధపు వ్యాఖ్యలతో మాజీ మంత్రి హరీశ్‌రావు సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీలో వాడీవేడీగా చర్చ జరిగింది.

2 లో

## 650 పేజీల కమిషన్ రిపోర్టుపై..

### ప్రతి అక్షరానికి సమాధానం ఇస్తా: హరీష్ రావు

పీసీ ఘోష్ కమిషన్ విచారణ చట్టబద్దంగా జరిగిందా లేదా అనే చర్చించాలి

నిజాలు ప్రజలకు తెలియాలి..

కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ 8B కింద.. నోటీసులు ఇవ్వని ఏ రిపోర్టు అయినా చిత్తుకాగితమే

2 లో



కరపత్రం తెలుగు దిన పత్రిక
సోమవారం సెప్టెంబర్ 1 2025

# సంపాదకీయం

## ఎమ్మెల్యేలు వసూల్ రాజాలు

తెలుగునాట.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పలువురు శాసనసభ్యులు వారి ముఖ్యమంత్రులకు కంట్లో నలుసుల్లా తయారవుతున్నారా? ఎం.ఎల్.ఎ. అంటే మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ.. అంటే చట్టసభ సభ్యులు. చట్టసభల్లో చట్టాలు చేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సిన శాసనసభ్యులే ఇప్పుడు ప్రజలపాలిట సమస్యగా మారుతున్నారు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లో కొంత మంది శాసనసభ్యులు లేని అధికారాలను సంక్రమింప జేసుకొని ఆయా నియోజకవర్గాలలో ప్రజలు గాలి పీల్చుకోవాలన్నా తమ అనుమతి తప్పనిసరి అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. 2004 నుంచి ప్రారంభమైన ఈ ధోరణి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వెర్రితలలు వేస్తోంది. జగన్మోహన్ రెడ్డి హయాంలో శాసనసభ్యులకు అపరిమిత స్వేచ్ఛను ఇవ్వడంతో వారు ప్రభుత్వ కార్యాలయాలను తమ అజమాయిషీలోకి తెచ్చుకున్నారు. ఇప్పుడు కూటమి ఎమ్మెల్యేలకూ అదే ఆదర్శమైంది. గతానికి భిన్నంగా ఈ జాడ్యం ఇప్పుడు తెలంగాణకు కూడా విస్తరించింది. 2009లో ఎమ్మెల్యేగా ఎన్నికైన లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ మంచినీటి సరఫరా, డ్రైనేజీ వంటి స్థానిక సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వారిని ఉద్దేశించి, వాటి గురించి స్థానిక ప్రజాప్రతినిధులైన కార్పొరేటర్లకు చెప్పాలని సూచించేవారు. ఇది ప్రజలకు రుచించలేదు. అది వేరే విషయం! 1983కు ముందు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉనికి ఉండేది కాదు. అక్కడి ప్రజా సమస్యలను స్థానిక సంస్థలే పరిష్కరించేవి. అప్పట్లో ఎమ్మెల్యేలు ప్రజలకు పెద్దగా అందుబాటులో ఉండేవారు కారు. ఎమ్మెల్యేలను కలుసుకోగలిగే పరిస్థితి జిల్లా స్థాయిలో కొద్దిమందికే ఉండేది. ఇక మంత్రులు, జిల్లా కలెక్టర్లను కలుసుకోవడం అరుదైన అవకాశంగా ఉండేది. అలా కలుసుకోగలిగిన వారికి పలుకుబడి ఉన్నట్టు పరిగణించేవారు. ఆ తర్వాత ఎన్టీఆర్ హయాంలో ప్రభుత్వాన్ని ప్రజలకు చేరువ చేశారు. దీంతో ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగక తప్పలేదు. ఫలితంగా ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలను, కుటుంబ పంచాయితీలను పరిష్కరించవలసిందిగా కూడా ఎమ్మెల్యేలను కోరేవారు. మొగుడూ పెళ్లాల పంచాయితీలు తామెందుకు పరిష్కరించాలని ఆ రోజుల్లో ఎమ్మెల్యేలు విసుక్కొనేవారు. హైదరాబాద్‌లో ఉండే తమ ఎమ్మెల్యేలను తెలంగాణ జిల్లాలకు చెందిన ప్రజలు వచ్చి కలుసుకొని బాధలు చెప్పుకొనేవారు. కొంతమందైతే తిరుగు ప్రయాణాలకు చార్జీలు ఇవ్వవలసిందిగా ఎమ్మెల్యేలను కోరేవారు. తమను కలవడానికి వచ్చిన వారికి కాఫీ, టీలు తాగించడంతో పాటు భోజనం, వసతి కూడా ఏర్పాటు చేయవలసి రావడంతో శాసనసభ్యులు ఆర్థికంగా నలిగిపోయేవారు. పెళ్లిళ్లు, చావులకు వెళ్లడం విధిగా మారింది. అదే సమయంలో ఖర్చుల కోసం డబ్బు కూడా డిమాండ్ చేసేవారు. తెలంగాణలో ఇప్పటికీ ఈ పరిస్థితి ఉంది. కొంత కాలం క్రితం ఒక లారీ డ్రైవర్ తమ నియోజకవర్గ ఎమ్మెల్యేకు ఫోన్ చేసి తాను డ్యూటీ మీద దూరంగా ఉన్నాననీ, పురిటి నొప్పులతో బాధపడుతున్న తన భార్యను ఆస్పత్రిలో చేర్పించి ప్రసవం చేయించవలసిందిగా కోరారు. ఇలాంటి విచిత్రమైన అనుభవాలను శాసనసభ్యులు గతంలో పంచుకొనేవారు. ఇదంతా గతం. ఇప్పుడు ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాలకు సామంత రాజులుగా, దండ నాయకులుగా తయారయ్యారు. తెలంగాణలో కూడా ఈ పోకడలు మొదలయ్యాయి. తెలంగాణలో యూరియా కొరత ఇప్పుడు ప్రధాన సమస్యగా ఉంది.రైతులు ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన రామగుండం ఎరువుల కంపెనీ తెలంగాణలో ఉన్నప్పటికీ సాంకేతిక సమస్యలు తలెత్తి ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో యూరియా కొరత మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితుల్లో ఎవరైనా ఏమి చేస్తారు? ఎరువుల ఫ్యాక్టరీలో మరమ్మతులను వేగంగా పూర్తిచేయించి ఉత్పత్తి తిరిగి ప్రారంభమయ్యేలా చేస్తారు. కానీ అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. మరమ్మతుల కాంట్రాక్టు పొందిన సంస్థ ప్రతినిధులు తనను కలసి తన సంగతి ఏమిటో తేల్చకపోతే ఎలా అని భీష్మించుకొని కూర్చున్నారు. ఈ వ్యవహారం మంత్రి, ముఖ్యమంత్రి వరకూ వెళ్లింది. దీంతో సంబంధిత శాఖ మంత్రి కల్పించుకొని సదరు ఎమ్మెల్యేను పిలిపించుకొని సర్దిచెప్పారు. ఈ ధోరణిని ఏమనాలి? ఇల్లు తగలబడుతుంటే బొగ్గులు ఏరుకోవడానికి ప్రయత్నించినట్టుగా లేదా? కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన కూడా తమ పార్టీ ఎమ్మెల్యేలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఈ విషయంలో ఒకరికొకరు ఆదర్శం అయ్యారు. ఫలితంగా తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేల ఆధిపత్యం పెరిగిపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారం చేయాలన్నా ఎమ్మెల్యేల అనుమతి తప్పనిసరి చేశారు. పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ కట్టాలన్నా శాసనసభ్యుడి అనుమతి ఉండాలని నిర్దేశించారు. దీంతో యావత్ అధికార యంత్రాంగం రాజకీయ నాయకుల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఒకవైపు లేని అధికారాలను అనుభవిస్తూ, మరోవైపు భూ కబ్జాలు, దందాలలో ఎమ్మెల్యేలు మునిగితేలారు. ఫలితంగా 2023 ఎన్నికలకు ముందు భారత రాష్ట్ర సమితికి చెందిన శాసనసభ్యులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అయినప్పటికీ ఆ ఎన్నికల్లో కేసీఆర్ అభ్యర్థులను మార్చకుండా పాతవాళ్లు అందరికీ టికెట్లు ఇచ్చారు. అప్రతిష్ఠపాలైన శాసనసభ్యులను మార్చి ఉంటే కేసీఆర్ అధికారం కోల్పోయి ఉండేవారు కాదన్న అభిప్రాయం భారత రాష్ట్ర సమితి ముఖ్యులలో ఇప్పటికీ ఉంది.

### నాడు 10 వేలు.. నేడు 30 కోట్లు!

ప్రభుత్వ వ్యవహారాలలో శాసనసభ్యులు జోక్యం చేసుకొనే విధానం 2004 నుంచే మొదలైంది. దీంతో శాసనసభ్యులు అక్రమ సంపాదనకు అలవాటుపడ్డారు. ఇప్పుడు అదొక హక్కుగా మారింది. ముఖ్యమంత్రులు సైతం ఎమ్మెల్యేలను అదుపు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో 2004 తర్వాత పైస్థాయిలో అవినీతి వ్యవస్థీకృతం అయింది. అదే సమయంలో మీరు కూడా సంపాదించుకోండి అన్నట్టుగా ఎమ్మెల్యేలకు స్వేచ్ఛ ఇచ్చారు. దీంతో చట్టసభల సభ్యులు జనం మీద పడ్డారు. ఐదేళ్లపాటు సంపాదించిన డబ్బుతో ఎన్నికల్లో మళ్లీ గెలవడానికి విచ్చలవిడిగా ఖర్చు చేయడం మొదలుపెట్టారు. దీంతో తెలుగునాట ఇప్పుడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒక నియోజకవర్గంలో సగటున 30 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. వచ్చే ఎన్నికల నాటికి ఈ మొత్తం ఇంకా పెరుగుతుంది. తెలుగు రాష్ట్రాలలో ఎన్నికలు ఖరీదైన వ్యవహారంగా మారాయి. 1985 ఎన్నికల్లో వెనుకబడిన శ్రీకాకుళంలోని ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి తెలుగుదేశం తరఫున పోటీ చేసిన ప్రతిభా భారతికి అయిన ఎన్నికల వ్యయం ఎంతో తెలుసా? కేవలం పది వేల రూపాయలు! అదే ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన జీవన్ రెడ్డికి అయిన వ్యయం 15 వేల రూపాయలు మాత్రమే. తన వద్ద ఉన్న పది వేలు సరిపోవని, మరో ఐదు వేలు పార్టీ తరఫున ఇప్పిస్తే గెలిచి వస్తానని ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎన్టీఆర్‌ను జీవన్ రెడ్డి కోరగా, మరుసటి రోజు ఎన్టీఆర్ ఆ ఐదు వేలూ సర్దుబాటు చేయించారు. అప్పట్లో పదివేలు మాత్రమే ఖర్చు చేసిన నియోజకవర్గాలలో ఇప్పుడు పది కోట్లు కూడా సరిపోవడం లేదు. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ఖర్చు వంద కోట్లు దాటుతోంది.

## 650 పేజీల కమిషన్ రిపోర్టుపై..

### ప్రతి అక్షరానికి సమాధానం ఇస్తా: హరీష్ రావు

మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టుపై అసెంబ్లీలో వాడీవేడీ చర్చ జరిగింది. 650 పేజీల ఘోష్ కమిషన్ రిపోర్టును సభలో చర్చకు పెట్టిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడంతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని ఆరోపించారు. దీనికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీరుపారుదల శాఖ మంత్రి, ఆర్థిక మంత్రులు బాధ్యత వహించాలని అన్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టుపై మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల ముందు..మాపై బురద జల్లే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తుందని అన్నారు.
కాళేశ్వరం పై ఘోష్ కమిషన్ తమకు చట్టబద్ధంగా నోటీసులు ఇవ్వలేదని.. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ 8B కింద మాకు నోటీసులు ఇవ్వకుండా రిపోర్టును ఏకపక్షంగా ఇచ్చిందని ఆరోపించారు హరీషరావు. 8B ప్రకారం నోటీసులు ఇవ్వని ఏ కమిషన్ నివేదిక నిలబడలేదని.. గతంలో జరిగిన కొన్ని కమిషన్ల రిపోర్టులను హరీష్ రావు వివరించారు. కాళేశ్వరంపై 650 పేజీల జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టుపై సమాధానం ఇవ్వాలంటే అరగంట సమయం సరిపోదు.. కనీసం రెండు గంటల సమయం కావాలని హరీష్ రావు స్పీకర్ ను కోరారు. దీనికి కాంగ్రెస్ సభ్యులు ఒప్పుకోలేదు.
ఎరువులు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతుంటే.. వరదలు వచ్చి పంట నష్టం, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పక్కదోవ పట్టించేందుకు కాళేశ్వరం పై చర్చకు పెట్టిందని.. ఎరువులు, వరదలపై సభలో చర్చకు అనుమతివ్వాలని హరీష్ రావు స్పీకర్ కోరారు. అయితే కాళేశ్వరం కమిషన్ పై చర్చ సందర్భంలో ఆ విషయంపైనే మాట్లాడాలని స్పీకర్ నిరాకరించారు.
కాళేశ్వరంపై ఎన్ని రోజులైనా చర్చకు సిద్ధం.. నిష్పక్షపాతంగా కమిషన్ విచారణ జరిగిందా లేదా తేలాలి.. చట్టబద్ధంగా కమిషన్ విచారణ జరగలేదు కాబట్టే మేం కోర్టు వెళ్లాం అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. రాజకీయంగా కాంగ్రెస్ కథ నడిపిస్తోంది.. కోర్టులో వాదనలు ఉన్నాయని ఆదరాబాదరాగా అసెంబ్లీలో రిపోర్టు ఉంచారు..ఆదివారం హడావుడిగా చర్చ అంటేనే కుట్ర అని అర్థం అవుతోందని విమర్శించారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ 8%దీ% కింద మాకు నోటీసులు ఇవ్వలేదు.. నిబంధనలు అనుసరించలేదనే మేం కోర్టు వెళ్లామన్నారు హరీష్ రావు.

## కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద మానవ తప్పిదం : ఉత్తమ్ కుమార్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఇచ్చింది. డిజైన్, నిర్మాణం, నాణ్యతలో లోపాలున్నాయని కమిషన్ చెప్పింది. పనుల పర్యవేక్షణలో లోపాలున్నాయని నివేదికలో వెల్లడించింది. సరైన ప్రణాళిక లేకుండా మేడిగడ్డ చేపట్టారని కమిషన్ రిపోర్ట్ ఇచ్చింది. భూగర్భ జలాలు దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టు కట్టలేదని తేల్చింది.
ప్రాణహిత చేవెళ్లను 2013లో అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది.. 2014 నాటికి 11 వేల కోట్లు ఖర్చు పెట్టారు. 38 వేల 500 కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత చేవెళ్లను..అకారణంగా రీజన్ లేకుండా కేసీఆర్ ప్రాజెక్టు డిజైన్ ను మార్చారు. లక్షా 47 వేలకోట్లకు పెంచారు. ఏడాదికి 195 టీఎంసీలు ఎత్తిపోస్తామని చెప్పి ప్రాజెక్టు కట్టి..ఐదేళ్లలో 125టీఎంసీలు మాత్రమే ఎత్తిపోశారు. లక్ష కోట్లు ఖర్చు పెట్టి ఏడాదికి కొత్త ఆయకట్టు లక్ష ఎకరాలు కూడా పారలేదు. లక్ష కోట్లు ఖర్చు చేసినా ఐదేళ్లలో వాడుకున్న నీళ్లు 101 టీఎంసీలే. ఇది మ్యాన్ మేడ్ డిజాస్టర్..ప్రపంచంలోనే ఇలాంటిదిఎక్కడా జరగలేదు. స్వతంత్ర భారతదేశంలో ఫైనాన్షియల్ డిజాస్టర్. మేడిగడ్డ కుంగినపుడు కేసీఆర్ సీఎంగా ఉన్నారు. 2023అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగింది.
బ్యారేజీ కట్టి డ్యాంలా వాడుకోవాలని చూశారు. అందుకే మేడిగడ్డ కూలిందని ఎన్డీఎస్ ఏ తేల్చింది. అధికారులు హెచ్చరించినా నీటి నిల్వ తగ్గించలేదు. పిల్లర్ల నుంచి ఇసుక కొట్టుకుపోయింది. కాళేశ్వరం వాడకున్నా రికార్డ్ స్థాయిలో పంట పండింది.మీ హయాంలో కట్టిన ప్రాజెక్టు..మీ హయాంలోనే కూలింది..మిమ్మల్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఎన్డీఎస్ ఏ రిపోర్టు ప్రకారమే కాళేశ్వరంలో నీళు నిల్వ చేయలేదు అని ఉత్తమ్ చెప్పారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికను ఎమ్మెల్యేలకు పెన్‌డ్రైవ్‌లో అందించిన ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

"నిపుణుల కమిటీ ప్రకారం మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించరాదు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేనందునే మేడిగడ్డ నిర్మించారనడం సహేతుకం కాదు. అప్పటి సీఎం కేసీఆర్ నిర్ణయం ప్రకారమే మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌లు నిర్మించారు. ఆనకట్టల నిర్మాణానికి ఇచ్చిన కాంట్రాక్ట్ విధానం సరికాదు. డీపీఆర్ పూర్తిగా పరిశీలించకుండానే అంచనాలు ఆమోదించారు.
కాంట్రాక్టర్ల లబ్ధికే అంచనాల పెంపు నిబంధనలు సడలించారు. ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చాలన్న దురుద్దేశంతోనే అంచనాలు సవరించి ఖజానాకు నష్టం చేకూర్చారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ నిర్వహణ సరిగా లేదు. ఆనకట్టల డిజైన్లు, డ్రాయింగ్స్‌లో పూర్తిగా లోపాలున్నాయి. మేడిగడ్డకు సబ్‌స్టాన్షియల్ సర్టిఫికెట్ ఇవ్వడం అక్రమం"అని జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ నివేదికలో పేర్కొంది.

## అమిత్ షాపై తీవ్ర వ్యాఖ్యలు.. ఎంపీ మహువా మొయిత్రాపై కేసు

బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను నిరోధించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ఉద్దేశిస్తూ టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు.



ఇవి కాస్త రాజకీయ దుమారం రేపాయి.
తాజాగా ఈ వ్యవహారంలో మహువాపై కేసు నమోదైంది. ఓ స్థానిక వ్యక్తి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్ పోలీసులు తెలిపారు.
ఎంపీ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, రాజ్యాంగ విరుద్ధమని ఫిర్యాదుదారు ఆరోపించినట్లు పోలీసులు వెల్లడించారు. అదేవిధంగా 1971 సమయంలో రాయ్‌పుర్‌లోని మానా క్యాంప్ ప్రాంతంలో అనేకమంది బంగ్లాదేశీ శరణార్థులు స్థిరపడ్డారని, మహువా వ్యాఖ్యలు వారిలో భయాందోళనలు రేకెత్తించాయని కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. అంతకుముందు పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్ కోత్వాలీ పోలీసు స్టేషన్‌లోనూ ఆమెపై ఫిర్యాదు దాఖలైంది.
బంగ్లాదేశ్ నుంచి చొరబాట్ల విషయంలో మహువా మొయిత్రా ఇటీవల కేంద్రంపై విరుచుకుపడ్డారు. "సరిహద్దు భద్రత విషయంలో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటోంది. భాజపా నేతలు పదే పదే చొరబాటుదార్ల గురించి మాట్లాడుతున్నారు. అయితే.. దేశ సరిహద్దుల్ని పరిరక్షించే బాధ్యతను ఐదు భద్రతాదళాలు నిర్వర్తిస్తున్నాయి. అవన్నీ కేంద్ర హోంశాఖ పరిధిలోనే పనిచేస్తున్నాయి. కేంద్ర హోం శాఖ, హోం మంత్రి సరిహద్దుల్ని రక్షించలేకపోయినప్పుడు.. చొరబాటుదార్లు దేశ ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రధాని స్వయంగా చెప్పినప్పుడు.. ఆ తప్పు ఎవరిది?" అని ఆమె ప్రశ్నించారు. ఈ క్రమంలోనే అమిత్ షా ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిని భాజపా ఖండించింది.

## అందుకే మామా అల్లుళ్లు లక్షకోట్లు కొల్లగొట్టేందుకు స్కెచ్ వేసింద్రు : సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ప్రజల లక్ష కోట్లు దోచుకునేందుకే ఇలా చేశారని.. మిమ్మల్ని శిక్షించాలని పీసీ ఘోష్ కమిషన్ చెప్తోందన్నారు.
కమీషన్ల కోసమే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ ప్రాంతాన్ని మార్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రాణహితలో నీళ్లు అందుబాటులో ఉన్నాయని 2009లోనే సీడబ్ల్యూసీ లేఖ ఇచ్చిందని చెప్పారు రేవంత్. ప్రాణహిత ప్రాజెక్ట్ కట్టుకోవచ్చని 2009లోనే కేంద్రం చెప్పిందన్నారు. సభను,ప్రజలను హరీశ్ తప్పుదారి పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు రేవంత్. హరీశ్ రావు తప్పు చేశారని పీసీ ఘోష్ కమిషన్ చెబుతోందని.. వాళ్ల తప్పులను బయటపెట్టారు కాబట్టే నివేదికను బీఆర్ఎస్ తప్పుబడుతోందన్నారు.

## అబద్ధపు వ్యాఖ్యలతో హరీశ్‌రావు సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: అబద్ధపు వ్యాఖ్యలతో మాజీ మంత్రి హరీశ్‌రావు సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీలో వాడీవేడీగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు వ్యాఖ్యలపై సీఎం స్పందించారు. ప్రాణహిత-చేవెళ్లలో నీళ్లు అందుబాటులో ఉన్నాయని అప్పటి కేంద్రమంత్రి ఉమాభారతి చెప్పారని గుర్తు చేశారు. 2015లో కేంద్ర మంత్రి తెలంగాణ ప్రభుత్వానికి రాసిన లేఖను సభలో చదివి వినిపించారు. " హైడ్రాలజీ క్లియరెన్స్ ఉందని, ప్రాణహిత-చేవెళ్ల కట్టుకోవచ్చని ఆనాడు ఉమాభారతి లేఖలో పేర్కొన్నారు. కానీ, దురాశ, దోపిడీతో మళ్లీ విచారణ చేయాలని భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కోరింది. కేంద్ర రాసిన లేఖను మళ్లీ పరిశీలించాలని అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు అధికారులను కోరారు.
ప్రాజెక్టు కట్టుకోవాలని 2009లో కేంద్ర ప్రభుత్వమే స్పష్టంగా చెప్పింది. అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్‌రావు మొత్తం వ్యవస్థల్ని తప్పుదోవపట్టించారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక పేజీ నెంబరు 98లో పేర్కొంది. వాస్తవాలను బయటపెట్టారనే జస్టిస్ ఘోష్ కమిషన్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించేలా హరీశ్‌రావు మాట్లాడుతున్నారు. ఏ విచారణ కావాలో చెప్పకుండా సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. తప్పుడు సమాచారాన్ని హరీశ్‌రావు పదే పదే చెబుతున్నారు. ఆయన వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలి. నీళ్లు అందుబాటులో ఉన్నాయని 2009, 2014లో లేఖలు రాశారు. తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు ఉన్నాయని చెప్పినా మీరెందుకు వినలేదు. మహారాష్ట్రతో చర్చ జరిగింది ప్రాజెక్టు ఎత్తు గురించే. ముంపు ప్రాంతం తగ్గుతుందనే ఎత్తు తగ్గించుకోవాలని మహారాష్ట్ర కోరింది. తెలంగాణ ప్రజల సొమ్ము రూ.లక్ష కోట్లు దోచుకునేందుకే ఇలా చేశారు. కేసీఆర్‌కు నిజాం కంటే శ్రీమంతుడు కావాలని దుశార కలిగిందేమో. మేడిగడ్డ వద్దే కట్టాలని అప్పటికే కేసీఆర్, హరీశ్‌రావు నిర్ణయం తీసుకున్నారు" అని సీఎం అన్నారు. కేంద్ర మంత్రి ఉమా భారతి రాసిన లేఖలో మొదటి పేజీ మాత్రమే చదివారు.. 3వ పేజీ చదవకుండా సీఎం రేవంత్‌రెడ్డి సభను తప్పుదోవ పట్టించారని హరీశ్‌రావు విమర్శించారు.

## బీసీ బిల్లులకు భారత రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: బీసీ బిల్లులకు భారత రాష్ట్ర సమితి సంపూర్ణంగా మద్దతు తెలుపుతోందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. శాసనసభలో పురపాలక, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు.
"బీసీల కోసం గతంలో కేసీఆర్ అనేక పోరాటాలు చేశారు. ఓబీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కోరారు. తెలంగాణ మొట్టమొదటి స్పీకర్‌గా బలహీనవర్గాల బిడ్డ మధుసూదనాచారిని, శాసన మండలి తొలి ఛైర్మన్‌గా స్వామిగౌడ్‌ను నియమించాం. అడ్వకేట్ జనరల్‌గానూ బలహీనవర్గానికి చెందిన బీఎస్ ప్రసాద్‌ను భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం నియమించింది. కె.కేశవరావు, డి.శ్రీనివాస్ (డీఎస్), బండా ప్రకాశ్, లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్రను రాజ్యసభకు నామినేట్ చేశాం" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## పూరీ క్షేత్రం పేరిట నకిలీ వెబ్‌సైట్ దోపిడీ!



పూరీ: ఒడిశాలోని ప్రముఖ పూరీ జగన్నాథ ఆలయంలో ఆన్‌లైన్ పూజల పేరిట భక్తులను మోసం చేస్తున్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను పోలీసులు గుర్తించారు. శ్రీక్షేత్రంలో ప్రత్యేక పూజలు, దర్శనం, నైవేద్య సమర్పణ తదితర సేవలు అందిస్తామంటూ తప్పుడు ప్రకటనలతో ఆ వెబ్‌సైట్ రూ.వేలల్లో దోపిడికి పాల్పడుతోందని పూరీ ఎస్పీ ప్రతీక్ సింగ్ తెలిపారు. ఈ వ్యవహారం గుట్టు రట్టు కావడంతో.. సైబర్ బృందాన్ని అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. ఆ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసి, కేసు దర్యాప్తునకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు."జగన్నాథుని దర్శనం, ప్రత్యేక పూజలు తదితర సేవలు అందిస్తామంటూ తప్పుడు ప్రకటనలు ఇచ్చే నకిలీ వెబ్‌సైట్‌లకు భక్తులు దూరంగా ఉండాలి. మోసపూరిత ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దు. ఆలయ యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించే ఛానెళ్ల ద్వారా సేవలను ధ్రువీకరించుకోవాలి. అధికారిక వెబ్‌సైట్‌లను మాత్రమే ఉపయోగించాలి. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో హోటళ్లను బుక్ చేసుకునే సమయంలో మరిన్ని జాగ్రత్తలు అవసరం. డబ్బుల కోసం భక్తుల మనోభావాలతో ఆడుకునేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఎస్పీ హెచ్చరించారు. - ఈటీవీ భారత్

## 'ఎయిరిండియా' విషాదం.. విఘ్నరాజాయ వందనం

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న వినాయక ఉత్సవాల్లో విభిన్న ఆకృతుల గణేశుడి విగ్రహాలు, ఆకట్టుకునే రూపకాలతో మండపాలు కొలువుదీరాయి. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గత జూన్ నెలలో జరిగిన ఎయిరిండియా విమాన ఘోర ప్రమాదం 260 ప్రాణాలను బలిగొనగా.. 60 మందికి పైగా క్షతగాత్రులుగా మారిన విషయం తెలిసిందే. ఈ ప్రమాద బాధితులకు నివాళిగా.. నాటి ఘటనాస్థలిని ప్రతిబింబిస్తూ అహ్మదాబాద్ నగరవాసులు ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేశారు. ప్రమాద తీవ్రతను చాటడంతోపాటు సిబ్బంది చేపట్టిన సహాయక చర్యలకు కృతజ్ఞతగా దీన్ని రూపొందించారు. మండపాన్ని సందర్శిస్తున్న భక్తులు ఆ మహా విషాదం పునరావృతం కారాదని గణపతిని మొక్కుతున్నారు.

# ప్రకృతి విలయతాండవం భారీ నుండి అతి భారీ వర్షాలు తో మెదక్ జిల్లాలో భారీ నష్టం కలెక్టర్ రాహుల్ రాజ్.

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మీద నరసాపూర్**
11 మండలాల్లో వర్షాలు వరదలతో నష్టాలు 02 మండలాలు 300 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతంతో వరద ప్రవాహంతో భారీ నష్టం వరద నష్టం అంచనాలలో తలమునకులైన జిల్లా అధికారులు రోడ్లు కల్వర్టులు, వంతెనలు చాలా ప్రాంతాలలో కోతకు గురైనవి తాత్కాలిక మర మత్తులతో రవాణా నుపునరుద్ధరించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించిన మెదక్ జిల్లా కలెక్టర్ నిజాంపేట్ మండలంలో వరదల కోతలకు గురి అయిన వంతెనలు రోడ్లు, కల్వర్ట్ ల పరిశీలనలో కలెక్టర్ వెల్లడి.ప్రకృతి విలయతాండవంలో భారీ వర్షాలు వరదలతో జిల్లాలో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని , రోడ్లు కల్వర్టులు, వంతెనలు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రవాణాను పునరుద్ధరించే దిశగా పటిష్ట చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.రామాయంపేట, నిజాంపేట్ మండలంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ ముందుగా రామాయంపేట నుండి సిద్దిపేట్ వెళ్లి జాతీయ రహదారి నిజాంపేట్ మండలం బ్రిడ్జ్ డామేజ్ ను పరిశీలించారు. అనంతరం,నిజాంపేట్ మండలం చల్మెడ



గ్రామంలోని ప్రవాహానికి కొట్టుకపోయిన రెండు బ్రిడ్జిలను,నిజాంపేట్ నుండి నస్కల్ వెళ్లి దారిలో వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన పురాతన బ్రిడ్జ్ లను రెవిన్యూ ఆర్ అండ్ బి అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలోని చెరువును మరియు పర్వతాపూర్ వెళ్లే దారిలో వరద ప్రభావానికి కొట్టుకుపోయిన బ్రిడ్జిని పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు వరదలతో కోతకు గురి అయిన రోడ్లు, కల్వర్టులు వంతెనలను అధికారులతో కలిసి పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులతో రవాణాను పునరుద్ధరించే దిశగా అధికారులకు పలు సూచనలు సలహాలు అందించడం జరిగిందని తెలిపారు. పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి, ఇరిగేషన్



అధికారులు క్షేత్రస్థాయిలో ఆయా శాఖల వారీగా జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నారని చెప్పారు.తాత్కాలికంగా రవాణాను పునరుద్ధరించే దిశగా ముందుకు పోతున్నామన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతానికి తాత్కాలిక మరమ్మతులు చేసి , అనంతరం శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించినట్లు చెప్పారు. పంట నష్టానికి సంబంధించి కొన్నిచోట్ల పంట పొలాలు నీటిలో మునిగినవని కొన్ని ప్రాంతాలలో ఇసుక మేటలు వేసినవని, వ్యవసాయానికి సంబంధించి మండల వ్యవసాయ అధికారులు అంచనాలు వేస్తున్నారని అన్నారు. 130 గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని యుద్ధ ప్రాతిపదికన అహర్నిశలు శ్రమించి విద్యుత్ను పునరుద్ధరించడం జరిగిందని చెప్పారు కొన్నిచోట్ల మిషన్ భగీరథ పైపులను కట్ ఆఫ్ అయిందని , త్రాగునీటి సౌకర్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మరమ్మతులు చేపట్టి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూసామన్నారు. 50 సంవత్సరాల లో ఇంత పెద్ద ఎత్తున ప్రకృతి విలయతాండవం చూడలేదని గ్రామాల పెద్దలు చెప్పారన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రకృతి విపత్తులు సంభవించిన దీటుగా ఎదుర్కొనేందుకు శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. రామాయంపేట పరిధిలో కాట్రియాల చెరువును పరిశీలిస్తూ చెరువు కట్టను వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు చెరువు కట్ట పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ముందు జాగ్రత్తగా పునరావాస కేంద్రాల్లో ఉంచడం జరిగిందన్నారు , కాట్రియాలనుండి పర్వతాపూర్ వెళ్లే రహదారి వరద ప్రవాహానికి వంతెన , విద్యుత్ వైర్లు కొట్టుకుపోవడం వల్ల పునరుద్ధరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు.వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వ నుండి సహాయ సహకారాలు అందుతాయని ఆందోళన పడవద్దని వివరించారు. అన్ని శాఖల అధికారులకు సెలవులు రద్దు చేయడం జరిగిందని వరద సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్న అన్నారు. మూడు నాలుగు రోజుల్లో సాధారణ స్థితికి వచ్చే విధంగాచర్యలుచేపట్టామన్నారు. వరద ముంపు వెళ్లిపోలేదని మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల వల్ల మంజీరాలు లక్ష క్యూసెక్కుల నీరు. చేరే అవకాశం ఉన్నందున మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఎలాంటి విపత్తులు సంభవించిన సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం ప్రజల రక్షణలో సిద్ధంగా ఉందన్నారు. భారీ వర్షాలు వలన వరద ప్రవాహ ఉధృతి పెరుగుతుందని వాగులు చెరువులు దాటి వెళ్ళవద్దని ప్రజలకు అవగాహన కల్పించినా కూడా పెడచెవిన పెట్టి దాటడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని అటువంటి సాహసాలు ఎవరు చేయవద్దని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట తాసిల్దార్ రజని, నిజాంపేట్ తాసిల్దార్ ఆర్ అండ్ బి ఈ.ఈ సర్దార్ సింగ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ చట్టాని ఎత్తి వేసిన రోజున ఎగరవేసిన జెండా.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 31**
ఎరుకల జాతి ప్రజలకు నిజమైన స్వాతంత్రం వచ్చిన దినంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎరుకల స్వీయ గౌరవ జెండాను కిసాన్నగర్ లో జెండా ఎగారావేయడం జరిగింది .ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానుపాటి రవి ఎరుకల ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ భారతదేశంలో ఆగస్టు 15న దేశ ప్రజలకు స్వాతంత్ర్యం వస్తే ఆదివాసి ఎరుకల ప్రజలకు మాత్రం ఆగస్టు 31న నిజమైన స్వాతంత్రం వచ్చినది. భారతదేశంలో కొన్ని రాష్ట్రాలలో 1902 - 03 నుండి బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రతినిధి జేఎన్ స్టీఫెన్ అనే గవర్నర్ ఆనాడు ఆదివాసి ఎరుకల ప్రజలు అంటేనే నేరస్తులు అని, సిటీ యాక్ట్ అమలు చేసి అనేక ఇబ్బందులకు గురి చేయడం జరిగినది. ఈ యొక్క క్రిమినల్ ట్రైబ్ అనే ఆక్ట్ 1871 నుండి 1952 వరకు అమలు చేశారు.ఆనాటి ఆదివాసి ఎరుకల ప్రజలు నాయకులు వీరోచితమైన పోరాటాలు చేసి వారి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాటం చేశారు. తరువాత ఢిల్లీలో ఉన్న మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ ని కలిసి 1951 లో సిటీ ఆక్ట్ ఎత్తివేయాలని కోరడంతో వినతి పత్రాన్ని



పరిశీలించి వీరు నిజమైన భారత దేశ మూల నివాసి ఆదివాసి ఎరుకల ప్రజలు భారతదేశ భూమి పుత్రులు కాబట్టి అని అర్థం చేసుకొని వెంటనే సిటీ ఆక్ట్ ఎత్తి వేయడం జరిగినది. 2023లో జీవో ఎంఎస్ నెంబర్ 5 ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం క్యాబినెట్ ప్రకటించిన ఏకలవ్య కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ , డైరెక్టర్లను నియమిస్తానని ప్రకటించి ఇంతవరకు నియమించలేదనీ ,వెంటనే పాలకమండలిని ఏర్పాటు చేసి 500 కోట్ల బడ్జెట్ కేటాయించి అభివృద్ధి పరచాలని కోరుతు, ఏకలవ్య చైర్మన్ పదవి ఎరుకల హక్కుల పోరాట సమితి ఉద్యమ నాయకులకు ఇస్తే ఇటు ప్రభుత్వానికి, అటు నిజమైన నిరుపేద ఎరుకల ప్రజలకు న్యాయం జరుగుతుందనీ,రాష్ట్రంలో సుమారు ఆదివాసి ఎరుకల కుటుంబాలు 50 వేలకు పైగా ఉన్నారనీ ,దాసరి కిషన్ రాష్ట్ర ఉద్యోగుల సంగం ప్రధాన కార్యదర్శి, ఓలుగుతుల పోచయ్య ఎరుకల హక్కుల పోరాట సమితి , ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బిజిలి శ్రీ నివాస్, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు బిజిలి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా సహాయక కార్యధర్శి బిజిలి శ్యామ్, ఉమ్మడి జిల్లా సోషల్ మిడియా కన్వినర్ మానుపాటి శ్రీనివాసు , ఎకలవ్య యువజన సంఘ సభ్యులు కట్ట రాజు, ఎరుకల ఉధ్యోగుల సంగం జిల్లా అధ్యక్షులు మొగిలి లచ్చయ్య ,మాజి కార్పొరేటర్ కుర్ర తిరుపతి ,కోతాడు జ్యోతి ,కుర్ర రాములు ,వొలగుత్తుల ఎల్లయ్య ,మొగిలి, మానుపాటి రాజేశం, కూతాటి సంతోష్ ,బిజిలి బాలయ్య ,కుర్ర రామకృష్ణ ,లోకిని కొమరయ్య ,కుర్ర సంపత్ , కుర్ర కనకయ్య, వొలగుత్తుల శ్రీ నివాస్, కోనేరు రవి ,సంగం నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు మోకాలు మార్పిడి ఆపరేషన్లు విజయవంతం

**– వేములవాడ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా,, పెంచలయ్య**



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఆదివారం నాలుగు మోకాలు మార్పిడి ఆపరేషన్లు దిగ్విజంగా పూర్తి చేశామని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 48 మోకాలు మార్పిడి ఆపరేషన్లు ఆసుపత్రిలో జరిగాయని, ఈ ప్రాంత ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఆపరేషన్ల కోసం వస్తున్నారని, ఇంకా దాదాపు 100 మంది దాకా ఆపరేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రతివారం మోకాలు మార్పిడి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని, ప్రాంతీయ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామని,సిటీ స్కాన్ ను పునరుద్ధరించామని, ప్రస్తుతం సిటీ స్కాన్ సేవలు, అల్ట్రా సౌండ్స్ సేవలు, ఎక్స్ రే సేవలు, అన్ని రకాల రక్త పరీక్షలు, కంటి ఆపరేషన్లు, సాధారణ శస్త్ర చికిత్సలు, గర్భిణీలకు సాధారణ కాన్పులు, ఆపరేషన్ లు, గర్భసంచి ఆపరేషన్లు, ఆర్థోపెడిక్ ఆపరేషన్లు, అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని, ఈ సదవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

# ఎరుకల ఆత్మగౌరవ పోరాట జెండాను ఆవిష్కరణ



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 31**
జమ్మికుంట పట్టణ పరిధిలోని 16 వ వార్డు ఎస్టీ కాలనీలో ఎరుకల కులాస్తుల సమక్షంలో ఎరుకల జాతి ఆత్మగౌరవ పోరాట జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా... సంఘ నాయకుడు తిరుపతి శ్రీనివాస్ మాట్లాడుతూ....1952 ఆగస్టు 31 రోజున క్రిమినల్ ట్రైబ్స్( సి.టీ యాక్ట్ ) అనే చట్టం రద్దు చేయబడిన దినాన్ని పురస్కరించుకొని ఎరుకల జాతి ప్రజల ఆత్మగౌరవ పోరాట జెండాను ఆవిష్కరించుకోవడం జరిగిందన్నారు.బ్రిటిష్ సామ్రాజ్య వాదుల దోపిడీలను మానసిక వైద్యులు అయినా ఎరుకల తెగలు పసిగట్టి తమ అడవి సంపదలను కొల్లగొట్టడానికి చేస్తున్న కుట్రలను తెలుసుకొని వారిపై బాణాలను ఎగ్గ పెట్టడానికి సిద్ధమైన సందర్భంలో ఎరుకల తెగల వారితో పాటు మిగతా తెగులపై క్రిమినల్ ట్రైబ్స్( సిటీ యాక్ట్ ) అనే నిర్బంధ చట్టాన్ని పెట్టి శారీరకంగా మానసికంగా హింసిస్తూ మా ఎరుకల జాతి ప్రజలు అంటేనే భయంకరమైనటువంటి తెగగా సమాజానికి తెలియజేసి అనేక అవమానాలకు గురి చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుల నాయకులు తిరుపతి సమ్మయ్య, రేవేల్లి బుచ్చయ్య ,తిరుపతి రాజమౌళి, రేవేల్లి రాజయ్య కేంసారపు తిరుపతి, కేతిరి సంజీవ్ కుమార్, లోకిని రాజయ్య రేవేల్లి శ్రీనివాస్ లోకిని చిన్న రాజయ్య, శంకర్,రవి, వెంకటేష్, పల్లకొండ రాజ్ కుమార్, తిరుపతి ఎల్ల స్వామి, కుర్ర రాజు, యూత్ అధ్యక్షులు లోకిని రాజేష్, ఉపాధ్యక్షులు రేవేల్లి మహేష్, కోశాధికారి రేవేల్లి సతీష్, సంయుక్త కార్యదర్శి ఉండాది అనిల్, రేవేల్లి అంజి, ప్రచార కార్యదర్శి రేవేల్లి బాలు తో పాటు ఎరుకల కులస్తులు పాల్గొన్నారు.

# బాల గణపతి మండపంలో కుంకుమార్చన, అన్నదానం

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి:**



గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం బాల గణపతి మండపంలో విశేషమైన కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమం భక్తిపూర్వకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి కుంకుమార్చన చేసి, ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణవేణి స్కూల్ డైరెక్టర్ మంజుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భక్తి భావంతో జరిగే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆధ్యాత్మిక శాంతి, ఏకత్వం తీసుకువస్తాయని, పండుగల స్ఫూర్తి తరతరాలకు అందించాలన్నదే మా ఆశయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రామగుండం పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
రామగుండం పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా గారు పూజా కార్యక్రమం నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకొన్నారు. అనంతరం సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారని, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిది ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది తాము మొదలు పెట్టిన పనులు ఎలాంటి విఘ్నాలు లేకుండా పూర్తి అయ్యేటట్లు చూడాలని మహాగణపతిని మనస్పూర్తిగా కోరుకన్నారు. ముఖ్యంగా రామగుండం కమిషనరేట్ పోలీసు శాఖ సూచించిన మేరకు ఆయా మండపాల నిర్వాహకులు, యువత జాగ్రత్తలు తీసుకోవడం కనిపించిందని, ఇదేరీతిలో నిమజ్జనం రోజు వరకు ప్రతి ఒక్కరు పోలీస్ వారికి సహకరించాలని ఎటువంటి ఆటంకాలు లేకుండా నిమజ్జన శోభయాత్ర నిర్వహించుకోవాలని ప్రజలకు సీపీ తెలిపారు. అనంతరం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో గత ఐదు రోజులుగా విశేష పూజలు



అందుకున్న గణనాథుని శోభయాత్రను సీపీ గారు ప్రారంబించగా గణపతి దేవుని ప్రతిమను డప్పు వాయిద్యాలతో, పోలీస్ అధికారులు సిబ్బంది, పిల్లలు, మహిళల కోలాటం ఆట పాటలతో అందరు ఆనందోత్సవ నృత్యాలతో కోలాహలం మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాస్, సిసి హరీష్, ఆర్ఎస్ఐ పోచలింగం, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ సేవలను తిరిగి ప్రారంభించేలా చర్చలు..

**– రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ**
ఆరోగ్యశ్రీ సేవలను ప్రైవేటు ఆసుపత్రుల్లో వెంటనే తిరిగి ప్రారంభించేలా చర్చలు జరుపుతున్నామని.. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, నియామకాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. శాసనసభలో అల్లోపతిక్ ప్రైవేట్ వైద్య సంరక్షణ సంస్థల (రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ) చట్టాన్ని రద్దుచేసే బిల్లును ఆయన ప్రవేశపెట్టి మాట్లాడారు. ఈ బిల్లుపై చర్చలో సంజయ్ (భారత రాష్ట్ర సమితి), హరీశ్‌బాబు (భాజపా) మాట్లాడారు.

**పురపాలికల అభివృద్ధి..**
రాష్ట్రంలోని పురపాలికల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఇస్నాపూర్ పురపాలిక విస్తరణ బిల్లును సీఎం తరఫున ఆయన శాసనసభలో ప్రవేశపెట్టి మాట్లాడారు. ఎస్‌డీఎఫ్, టీయూఎఫ్‌ఐడీసీ నిధులను శాస్త్రీయంగా ఎక్కడ అవసరముంటే అక్కడే ఖర్చు చేస్తున్నామని వివరించారు.ది

# వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో మహా కుంకుమ పూజ



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర వ్యాపారుల సంఘం బద్ది పోచమ్మ వీధి శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మహా కుంకుమపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కుంకుమ పూజ కార్యక్రమంలో దాదాపు 80 మంది మహిళలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మధు రాజేందర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్, వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షులు ఎల్ల పోశెట్టి, పట్టణ అధ్యక్షులు పిన్నింటి హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ మన్ కీ బాత్ వీక్షించిన కోలగని శ్రీనివాస్, కటకం లోకేష్.




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 31**
ఆదివారం రోజున ప్రసారమైన ప్రధాని మోదీ మన్ కి బాత్ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ , బిజెపి మీడియా కన్వీనర్ కటకం లోకేష్ ఆరేపల్లి లో స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి వీక్షించారు. ప్రోగ్రాం అనంతరం స్థానిక నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 3 న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు కరీంనగర్ జిల్లా పర్యటన విజయవంతం చేయాలని బిజెపి నాయకులకు కార్యకర్తలకు కటకం లోకేష్ పిలుపునిచ్చారు. కొండసత్యలక్ష్మి గార్డెన్స్ లో జరిగే బూత్ సమ్మేళన సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. పోలింగ్ బూత్ అధ్యక్షులు , కార్యదర్శి , సోషల్ మీడియా బాధ్యులు తప్పకుండా ఈ సమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బత్తిని మహేష్ గౌడ్, బత్తిని రాజశేఖర్, సత్తినేని ప్రభాకర్, భారీ జితేందర్, కొత్తపల్లి వెంకటేష్, నాన్ వినోద్, బత్తిని మురళి, కొత్తపల్లి రాము, సత్తినేని సంతోష్, బత్తిని నరేష్ , పవన్, శేఖర్,కొత్తపెల్లి మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

- పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయండి
- సిపిఎం పార్టీ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
మిడ్ మానేరు జలాశయంలో ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు సరైన ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని బోయిన్ పెల్లి సిపిఎం పార్టీ మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ అన్నారు. ఆదివారం మండలంలోని వరదవెల్లి గ్రామంలో ముంపు గ్రామాల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు ఇచ్చినా అవి ఆచరణలోకి రాలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నా ముంపు సమస్యలను పట్టించుకోకపోవడం విడ్డూరమని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి, ముంపు గ్రామాల ప్రజలకు, చదువుకున్న యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రామంచ అశోక్, వనపర్తి లచ్చయ్య, వల్లంపట్ల బాలయ్య, అంబటి చంద్రయ్య, మందాల రవి, గోట్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ పూజ స్థలాల్లో మార్పు







- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు
-ఆలయ ఈవో రమాదేవి

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఆలయ ఈవో రమాదేవి పలు పూజలు జరిగే స్థలాల్లో మార్పులు చేశారు. ఆలయ కళాభవన్ నందు జరిగే నిత్య కళ్యాణం, చండీ హెూమం, సత్యనారాయణ వ్రతం వంటి పూజలను ఆదివారం ఆలయ ఓపెన్ స్లాబ్ హుండీ కౌంటింగ్ జరిగే ప్రదేశంలో ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను ప్రత్యక్షంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎల్. రమాదేవి పర్యవేక్షించారు. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని, అభివృద్ధి ఏర్పాటల్లో భాగంగా పలుమార్పులు చేయడం జరిగిందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# చెన్నూర్ ఎస్బీఐలో బంగారు ఆభరణాల దుర్వినియోగం..

- 10 ప్రైవేట్ గోల్డ్ లెండింగ్ సంస్థలలో 44 మందిపేర్లపై 142 గోల్డ్ లోన్లు...
- 44 మందిపై కేసు నమోదు, 15.23 కిలోల బంగారం రికవరీ...





**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 31:**
మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో ఎస్బీఐ బ్రాంచ్‌లో వెలుగులోకి వచ్చిన భారీ బంగారు ఆభరణాల మోసం కేసు జిల్లాలో సంచలనం రేపింది. కోట్ల రూపాయల విలువైన గోల్డ్ లోన్ ఆభరణాలు, నగదు మాయమైన విషయం బయటపడటంతో పోలీసులు క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టి 44 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో ముగ్గురు బ్యాంకు ఉద్యోగులు కూడా ఉండటం మరింత కలకలం రేపింది. 2025 ఆగస్టు 23వ తేదీ ఉదయం ఎస్బీఐ రీజినల్ మేనేజర్ రితేష్ కుమార్ గుప్తా చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన వివరాల ప్రకారం బ్యాంకులో 402 గోల్డ్ లోన్ ఖాతాల ఆభరణాలు, దాదాపు 25.17 కిలోల బంగారం (విలువ రూ.12.61 కోట్లు) మరియు రూ.1.10 కోట్లు నగదు దుర్వినియోగం చేయబడ్డాయి. ఈ ఫిర్యాదు అందుకున్న వెంటనే రామగుండం పోలీస్ కమిషనర్ ఏ.భాస్కర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.ప్రాథమిక దర్యాప్తులోనే క్యాషియర్ నరిగె రవీందర్ ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలు బహిర్గతమయ్యాయి. అదుపులోకి తీసుకున్న రవీందర్ విచారణలో క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు నష్టపోయిన తర్వాత మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌తో కుమ్మక్కై మోసానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. బ్యాంక్ కరెన్సీ ఛెస్ట్ తాళాలు మేనేజర్ నుంచి పొందిన రవీందర్ బంగారం, నగదు దొంగిలించి తన పరిచయస్తుల సహకారంతో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టేవాడు.దీని ఫలితంగా 10 ప్రైవేట్ గోల్డ్ లెండింగ్ సంస్థలలో 44 మందిపేర్లపై 142 గోల్డ్ లోన్లు తీసుకున్నట్లు విచారణలో బయటపడింది. అంతేకాకుండా తప్పుడు గోల్డ్ లోన్లు కూడా మంజూరు చేసి రూ.1.58 కోట్లు విత్‌డ్రా చేసినట్లు పోలీసుల దర్యాప్తు తేల్చింది. మొత్తం 21 కిలోల బంగారం విలువైన నష్టం జరిగినట్లు అంచనా.దర్యాప్తు బృందాలు ఇప్పటివరకు 15.23 కిలోల బంగారం, రూ.1,61,730 నగదు స్వాధీనం చేసుకున్నాయి. మిగిలిన ఆభరణాలు ముత్తూట్, మణప్పురం, గోదావరి అర్బన్ వంటి సంస్థల వద్ద ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీటిని కూడా రాబట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. నిందితులలో ఎస్బీఐ బ్రాంచ్ క్యాషియర్ నరిగె రవీందర్, బ్రాంచ్ మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌లతో పాటు ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల మేనేజర్లు, సిబ్బంది, స్థానికులు ఉన్నారు. మొత్తం 44 మంది అరెస్టు కాగా, ఇద్దరు పరారీలో ఉన్నట్లు సమాచారం. ఈ కేసును స్వల్పకాలంలోనే ఛేదించినందుకు దర్యాప్తు బృందాలను కమిషనర్ ఏ.భాస్కర్ ప్రత్యేకంగా అభినందించారు.

# స్థానిక సమస్యలు పరిష్కరించాలి



- సిపిఎం మండల కార్యదర్శి శీలం అశోక్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 31**
జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మోత్కులగూడెం దుర్గా కాలనీ కాలనీలలో సిపిఎం బృందం ఇంటింటి సర్వే నిర్వహించి పలు సమస్యలను గుర్తించడం జరిగింది.
ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శీలం అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా స్థానిక సమస్యలు పరిష్కరించడం లేదని దుర్గా కాలనీ లోని డ్రైనేజీ సౌకర్యం సరిగా లేక ఇళ్లలోకి మురుగు నీరు వచ్చి పందులు కుక్కలు, దోమలు వస్తున్నాయని వీటి బారిన పడి కాలనీవాసులు ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ కాలనీలో నీటి నిల్వ ఉండడం వలన అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని మున్సిపల్ అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు ఈ ఏరియాలో ఖాళీ స్థలం ఉండడం వల్ల చెట్లు మురికి నీరు చేరి దుర్గంధం మస్తున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు.ఏరియాలో నల్ల నీళ్లు కూడా రావడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ సమస్యలన్నింటిని మునిసిపల్ అధికారులు పట్టించుకోని ప్రజల ఆరోగ్యం పై దృష్టి సారించాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, రేషన్ కార్డు లేని పేదలకు తక్షణమే రేషన్ కార్డులు ఇవ్వాలని, నగరంలో రోడ్లు డ్రైనేజీ బాగు చేయాలని అన్నారు.
కొంతమంది దగ్గర ఉన్నటువంటి ఇందిరమ్మ ప్రెసిడెంట్ కాపీలను మళ్లీ వెనక్కి తీసుకోవడం ఏంటి అని మళ్లీ రీసర్వే నిర్వహించి వారికి వెంటనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కరెంటు స్తంభాలు చాలా అస్తవ్యస్తంగా ఉన్నాయి చెట్లు తీగల ఆనుకొని వర్షం వస్తే కరెంట్ షాక్ వచ్చే ప్రమాదాలు ఉన్నాయని వాటిని గుర్తించి విద్యుత్ అధికారులు సమస్యలు పరిష్కరించాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తామని అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్న నేటికీ అమలు చేయకపోవడం మంచి పద్ధతి కాదని వెంటనే అర్హులైన మహిళలందరికీ నెలకు 2500 రూపాయలు ఇవ్వాలన్నారు
ఇప్పటికైనా సమస్యలన్నింటిని పట్టించుకోని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జక్కుల రమేష్ యాదవ్ దండిగారి సతీష్ వడ్లూరు కిషోర్ కుమార్ గేరే రాజకుమారి కన్నం సదానందం తదితరులు పాల్గొన్నారు

# పూర్వ విద్యార్థి కుటుంబానికి మిత్రుల ఆర్థిక సహాయం

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్, ఆగస్టు 31:**
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ సి 1994- 95 బ్యాచ్ పూర విద్యార్థి బొడిగ తిరుపతిగౌడ్ కుమారుడు బోడిగే సందీప్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు సందీప్ కు ఇద్దరు చిన్నారులు ఉండడంతో వారిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలని ఎస్ఎస్సి బ్యాచ్ మిత్రులందరు పూనుకున్నారు. తలా కొంత వేసుకొని పూర్వ విద్యార్థులు (మిత్రులు) కొందరు ఆదివారం వారి ఇంటికి వెళ్లి పిల్లల పేరున ఆర్థిక సహాయం(?10వేలు) అందజేశారు. చిన్ననాటి మిత్రుని కుటుంబము కష్టాల్లో ఉందని తెలుసుకొని చేదోడు వాదోడుగా ఉండాలని మంచి ఆలోచనతో పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చి మిత్రుని కుటుంబానికి అండగా నిలవడం పట్ల పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోరే కుమార్, గోస్కుల చందు, అలిసిరీ శశిభూషణ్, చీకోటి వెంకటరమణ, పిన్ రెడ్డి రాజేందర్ రెడ్డి, పూర్వ విద్యార్థి బొడిగ తిరుపతిగౌడ్ అతని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

